
జన్మదిన కథల పోటీలో సాధారణ ప్రచురణ కథ




అది ఒక ఆఫీసు...

అక్కడ పెద్ద హాల్లో అందరూ సమావేశం అయి ఉన్నారు. ఏదో వార్త కోసం ఎదురుచూస్తున్నట్లున్నాయి వాళ్ల మొహాలు. ఇంతలో హరి పరుగెత్తుకుంటూ వచ్చాడు.

"హెడ్డాఫీసు నుంచి రాకేష్ ఫోన్ చేశాడు. మూడు నెలల్లో మనకు రిట్రెంచ్‌మెంట్ ఇస్తున్నారుట" అన్నాడు.

పిడుగుపడ్డట్లు అయింది... అంతా నిశ్శబ్దం. అందరూ కొయ్యబారిపోయారు.

"నిజంగానా..." ఎవరో తేరుకుని ప్రశ్నించారు. అంత నిశ్శబ్దంలో కూడా ఆ గొంతు బావిలోంచి వినిపిస్తున్న స్వర్గంలా నీరసంగా వినిపించింది.

"అవును. ఆఫీసు మొత్తం కంప్యూటరైజ్ అయిపోతుందిట. ఒక్కో కంప్యూటరూ యాభై మంది పని చేసి పారేస్తుందిట. శుభ్రంగా పది కంప్యూటర్లు పెట్టుకు కూర్చుంటే సరి. అయిదు వందల మందిని రిట్రెంచ్ చేసి పారేయొచ్చని తీర్మానించారట ఇందాక మీటింగ్‌లో." మెల్లగా చెప్పాడు హరి.

"ఇంత ఘోరమా. జాబ్ సెక్యూరిటీ ఉందని కదా ఈ ఉద్యోగాలకి వచ్చాం."

"ఏం సెక్యూరిటీ లెండి! మన అపాయింట్‌మెంట్ ఆర్డర్‌లోనే ఉంది కదా, మూడ్నెల్ల నోటీస్ ఇచ్చి ఎప్పుడైనా పీకిపారేయొచ్చని... కోర్టుకి పోయినా లాభం ఉండదు."

"అవును. కానీ, మనల్ని పీకితే అసోసియేషన్ వాళ్లు ఊరుకుంటారా?"

"బోడి అసోసియేషన్! వీళ్లంతా హెడ్డాఫీసులో డబ్బులు తిని అన్నిటికీ తల ఊపి వస్తారు. ఎవడి బాగు వాడు చూసుకుంటాడు. వాళ్లకి లక్షల్లో ముట్టచెపితే శుభ్రంగా భోంచేసి ఎక్కడ సంతకం పెట్టమంటే అక్కడ పెడ్తారు. మనకేవో కంటితుడుపు మాటలు నాలుగు చెప్పి వాళ్ల దారిన వాళ్లు పోతారు." ఎవరో కసిగా అన్నారు.

అంతా బిక్కచచ్చి కూర్చున్నారు.

అసోసియేషన్ కూడా రక్షించకపోతే ఇంక ఎవరు దిక్కు. అందరికీ ఏడుపు వచ్చేసింది.

కనకయ్య దిగులు చూపులు చూస్తున్నాడు. ఈ ఉద్యోగాన్ని నమ్ముకుని పిల్లల్ని పై చదువుల్లో చేర్పించాడు. ఇప్పుడు ఎలా చదివించాలి? భయంతో గుండె పట్టుకున్నట్లు అయింది.

జబ్బు లున్నవాళ్లు, అప్పు లున్నవాళ్లు, బాధ్యత లున్నవాళ్లు, ఏ అవసరం లేకున్నా సరదాగా ఉద్యోగం చేస్తున్న వాళ్లు... అంతా చేష్టలు దక్కి చూస్తున్నారు.

తమ సంగతేమిటి?

ఏం చెయ్యాలి... ఎటుపోవాలి.

కోర్టులు, అసోసియేషన్ హు... లాభం లేదు.

"మంత్రుల్నో ఎమ్మెల్యేలనో పట్టుకుంటే?"

"లాభం లేదండీ! వాళ్లకి వాళ్ల సీట్లు పదిలంగా ఉంటే చాలు. ఎవరు ఎటుపోతేనేం... పాలకపక్షం వాడు ఎట్లాగూ మన సంగతి పట్టించుకోడు. ఇక ప్రతిపక్షం వాళ్లు... నాలుగు రోజులు నాటకం ఆడ్తాడు. ఇంకో కొత్త సమస్య దొరికితే దాన్ని పట్టుకుని మనల్ని వదిలేస్తాడు. ఈ లోపల ఎన్నికలు వస్తాయి. ఎవరు గెలుస్తారో.

చెప్పలేం. ఇప్పుడు ప్రతిపక్షంలో ఉన్నవాడు పాలకపక్షం కావచ్చు. అప్పుడు వా డిక మన్ని పట్టించుకోడు. అప్పటి ప్రతిపక్షంలోవాడు పాలకపక్షంలో ఉన్నప్పుడు మీరేం చేశారని ఎదుటి పక్షం వాళ్ళు అడుగుతారని మన చాయలకి రాడు. ఏ దిక్కూ లేదండీ" అన్నాడు దీనంగా రాజారావు.

ప్రళయంలా విరుచుకుపడ్డ ఈ సమస్యని ఎట్లా ఎదుర్కోవాలో ఎవరికీ అర్థం కావటం లేదు.

అట్లాగని ఈ సమస్య వాళ్ళు బొత్తిగా ఊహించనిది కూడా కాదు.

ఆఫీసులో ముద్దు లొలికే కంప్యూటర్లు రావటం, వాటిని ముద్దు చేస్తూ అందాల ఎ.సి. గదుల్లో పెట్టడం, పెద్దాఫీసర్లందరూ ఆ గది చుట్టూ భక్తిగా తిరగటం, ఆఫీసులో రిటైర్‌మెంట్, మరణాలు, తదితర కారణాల వల్ల ఏర్పడే ఖాళీలను భర్తీ చెయ్యకపోవటం, ఆ సీట్ల పని ఎవరితోనో ఒకరితో చేయించేసి ఎట్లాగో కాలక్షేపం చేయటం, కొన్ని సెక్షన్లను కుదించి ఒకే సెక్షన్ చేసిపారేయటం - ఇట్లా ఒకటొకటీ కలుపుకుని అర్థం చేసుకుంటూనే ఉన్నారు. కానీ ఈ పెను ప్రమాదం మాత్రం ఎవరూ ఊహించలేదు. ఏదో ఇక ముందు ప్రమోషన్ రావనో, కొత్తవాళ్ళని చేర్చుకోరనో అనుకుంటున్నారే తప్ప, అసలుకే ఎసరు పెడ్తారనుకోలేదు.

"అయితే మన సంగతి ఏమిటండీ? ఎవరూ పట్టించుకోరంటారా? ఇంతమందిని ఒకేసారి నిరాధారుల్ని చేస్తే ప్రజలు చలించరా?" అడిగాడు రాకేష్.

రాజారావు పేలవంగా నవ్వాడు.

"ఎవరు పట్టించుకుంటారండీ? ఎందుకు పట్టించుకుంటారు? ఎన్ని కంపెనీలు మూతపడి వాటి సిబ్బంది ఇంటికి చేరలేదు. వాళ్ళు తిండికి లేక ఎంత ఇబ్బందిపడటంలేదు? వాళ్ళల్లో కొందరు కుటుంబాల్ని పోషించలేక విషం తాగి ఆత్మహత్య కూడా చేసుకున్నారు. ఎవరు పట్టించుకున్నారు? ప్రతివాడూ చిన్ని నా పొట్టకి శ్రీరామరక్ష అనుకుంటాడు. మనం ఏమైపోతే ఎవరికి కావాలి?" ఆవేశంగా అన్నాడు రాజారావు.

అందరి హృదయాలూ రగిలిపోయాయి.

అంతేనా - - తమ జీవితాలు తల్లకిందులై పోయినా, ఆఫీసు పెద్దలు ఒక్క కలం పోటుతో తమ వెన్నువిరిచినా ఎవరూ పట్టించుకోరన్నమాట. అయ్యో... ఇదాలోకం... ఇట్లాంటి లోకంలో జీవిస్తున్నారా తాము... అందరి హృదయాలూ క్షోభించాయి.

"అసలు మనవాళ్ళకి మతిలేదండీ! ప్రతి చోటా ఏమి టీ కంప్యూటరైజేషన్... ఏదో అమెరికా లాంటి దేశాల్లో అయితే పనిచేసేందుకు మనుషులు తక్కువై యంత్రాల్ని ఆశ్రయించారన్నా అర్థం ఉంది. మన కేమిటీ, ఎక్కడ చూసినా పాతిక్కో యాభైకి కూడా ఉద్యోగాలు చేస్తామంటూ తయారవుతున్న మన దేశానికి కంప్యూటరైజేషన్ ఏమిటి చెప్పండి! దీనివల్ల ఎంతమంది ఉద్యోగావకాశాలు కోల్పోతారు. ఎంతమంది ఉద్యోగాలు పోతాయి? అవన్నీ ఆలోచించరేమిటి?"

"నిజమే."

"ఎంతమంది ఉద్యోగాల్లేక అలమటిస్తున్నారు! వీథుల్లోకి వెళ్లి చూస్తే అడుక్కునేవాళ్ళు, బడుగు ప్రజలు, జీతాలు చాలక అలమటించేవాళ్ళు... హుఁ." నిట్టూర్చాడు కాంతారావు.




అందరికీ ఒక్కసారిగా సమస్త ప్రజల కష్టాలూ హృదయానికి అవగతం కావటం మొదలుపెట్టాయి.

"ఛీ! దేనికీ భద్రత లేదు. చేసే ఉద్యోగానికి లేదు. బతికే బతుక్కి లేదు. ఎక్కడ చూసినా అక్రమాలు, అశాంతి, టెర్రరిస్టులు, మిలిటెంట్లు, డెకాయిట్లు...."

"ప్రతి వాడూ తను బాగుంటే చాలునని చూసుకుంటున్నాడే కానీ, దేశం సంగతి పట్టించుకోవటంలేదు. ఎక్కడ చూసినా పెచ్చుమీరిపోతున్న హింస.... మనమూ మన పిల్లలూ బాగున్నాం చాల్లే అనుకుంటే మనకే నష్టం. మనం సమాజంలో భాగమే కానీ ఏకాకులం కాదు. మనం ఒక్కళ్లం బాగా ఉంటామండీ... ఏం లాభం. ఎవడో వచ్చి మనల్ని పిట్టల్ని కాల్చినట్లు కాల్చిపారేయొచ్చు. లేకుంటే మనల్నో మన పిల్లల్నో కిడ్నాప్ చేసిపడేయొచ్చు. అందుకని నేను చెప్పేదేమిటంటే మనం బాగుండాలంటే దేశం మొత్తం బాగుండాలి. శాంతిభద్రతల కోసం ప్రతివాడూ కృషి చెయ్యాలి ఏమంటారు" అన్నాడు రమేష్.

ఏమంటారు.. అతను చెప్పిందాంట్లో నిజం ఉంది. కాబట్టి అంతా తల లూపారు.

"స్వార్థం ఉండకూడదండీ! అప్పుడే దేశం బాగుండేది" అన్నాడు కాంతారావు.

కాంతారావు కీ మధ్య ఒక చేదు అనుభవం అయింది. వాళ్ల కాలనీలో ఒకతను చిట్‌ఫండ్ కంపెనీ పెట్టాడు. కాలనీ వాళ్లల్లో చాలా మంది చీటీ కట్టారు. అతను అన్నీ కట్టించుకుని చివర్లో డబ్బులు ఇవ్వాల్సి వచ్చేసరికి దివాలా తీశానని డిక్లేర్ చేసిపారేశాడు.

అంతే....

జనం ఇష్టం వచ్చినట్లు ప్రవర్తించారు.

కొందరు చేతి కందిన బీరువాలు, టేబుల్స్, ఫాన్లు వగైరా తెచ్చేసుకున్నారు. ఇంకొంతమంది అతను నిజంగా దివాలా ఎత్తలేదనీ, అట్లా నటిస్తున్నాడనీ, తెలుసుకుని వాడిని బెదిరించి డబ్బు తెచ్చుకున్నారు. కాంతారావు కూడా వీటిల్లో ఏదో ఒకటి చేసేవాడే. కానీ, అతను వీటిల్లో ఏది చేద్దామా అని ఆలోచించి నిర్ణయం తీసుకునే లోపలే చిట్‌ఫండ్ వాడు డేరా ఎత్తేశాడు. కాంతారావుతోపాటు మిగిలిన వాళ్లందరికీ నెత్తిన చెంగు మిగిల్చాడు.

కాంతారావుకి ఒళ్లు మండిపోయింది.

జనంలో ఐకమత్యం లేనందువల్లే ఇదంతా జరిగిందని అతను తిడుతుంటాడు.

ఆ చిట్‌ఫండ్ వ్యవహారంలో ఎవరికి వాళ్లు తమ డబ్బు మాత్రం ముట్టితే చాలు ననే ధోరణిలో ప్రవర్తించటం వల్ల బలం ఉన్నవాడిదే రాజ్యం అయి కొందరికి రావల్సిన దానికన్నా ఎక్కువే వస్తే, చాలా మందికి అసలేమీ రాకుండా పోయింది. అట్లా కాకుండా అందరూ కలసికట్టుగా ఉండి వాడి నుంచి డబ్బు రాబట్టేందుకు ప్రయత్నిస్తే అందరికీ అంతా కాకపోయినా చాలామటుకు వచ్చి ఉండేది. కొందరి ప్రజల అతి తెలివి వల్ల చాలా మందికి నష్టం జరిగింది. అందుకే ప్రజల్లో ఐకమత్యం లేదని తిట్టిపోస్తుంటాడు సమయం దొరికినప్పు డల్లా.

మామూలుగా అయితే....

"దొంగవెధవ! ఏదో చెప్తుంటాడు. అసలు వీడు మంచి వాడయితేగా? అంత నిజాయితీపరుడే అయితే ఆ చిట్‌ఫండ్ వాడి మీద మొదట్లోనే పోలీస్ రిపోర్ట్ ఎందుకు ఇచ్చాడు కాదు. ఎందుకు ఇవ్వలేదంటే... ఇస్తే తను మళ్లీ వాడి సామానేదైనా తెచ్చుకునే వీలుండదని! తనకి కుదరలేదు కాబట్టి ఇప్పుడు నీతులు వల్లిస్తున్నాడు" అనుకునే వాళ్లు అందరూ.

కానీ ఈ రోజు అట్లా అనుకునే పరిస్థితిలో లేరు.

వాళ్ల హృదయాలు నిష్కల్మషంగా ఉన్నాయి. ఎవరి మాటల్ని అయినా, శంకించకుండా, ప్రేమగా, ఆదరణగా, స్వీకరించే స్థితిలో ఉన్నారు.

అవునంటే అవు నన్నారు.

"'ఏమిటో ఇట్లా మోసగాళ్లు, దుర్మార్గులు, దుష్టులు నిండిపోయారు. మనుషుల్ని ఎత్తుకుపోయి కిడ్నీలూ, గుండే, కళ్లూ కూడా అమ్మేసే ముఠా లున్నాయిట. పిల్లల్ని ఎత్తుకుపోయి బానిసలుగా అమ్మేవాళ్లున్నారుట. ఆడవాళ్లని అపహరించుకుపోయి వ్యభిచారులుగా మారుస్తున్నారుట. దుష్టులు, దొంగలు, ద్రోహులు నిండిన ఈ లోకం సంగతి ఎవరూ పట్టించుకోవటంలేదు. దుర్మార్గాలని అంతం చెయ్యాలని ఎవరూ అనుకోరు. ఛీ! స్వార్థం నిలువెల్లా నిండిపోయింది. ఎవడికి వాడు నేను బాగుంటే చా లనుకుంటాడు" అన్నాడు సుగుణాకరరావు.

"అంతే నండీ అంతే!"

"అసలు మన దేశంలో లేనిదేది? సహజ సంపద, వనరులు, మనుషులు, తెలివితేటలు అన్నీ ఉన్నాయి. కలిసికట్టుగా కృషి చేస్తే దేనికి లోటు ఉంటుంది? కాని, పిల్లి మెడలో గంట కట్టేదెవరు? ఎవడికి వాడు తను హాయిగా కూర్చుంటే అవతలివాడు పని చెయ్యాలనుకుంటాడు. అందరూ కలసి కష్టపడదాం అనుకోరు. అందుకే ఎక్కడ వేసిన గొంగళి అంటే అన్నట్లున్నాయి. అదే జపాన్, చైనా

లాంటి దేశాలు చూడండి. స్వల్పకాలంలోనే ఎంత అభివృద్ధి సాధించాయో."

అంతా నిట్టూర్చారు.

కాసేపు నిశ్శబ్దం... శ్మశాన నిశ్శబ్దం.

భవిష్యత్తు శూన్యమై... బతుకు భారమై, ఒక్కొక్కళ్లకీ గుండె మండిపోతోంది.

"మన సంగతి ఏం చేద్దా మంటారు?" ఎవరో మెల్లగా అడిగారు.

"ఏమైనా చేద్దాం! ఏం చెయ్యటానికైనా నేను సిద్ధమే. అంతేకానీ చేతులు ముడుచుకుని ఇంటిదారి పట్టను."

"నేనూ అంతే" అన్నారు ప్రతి ఒక్కళ్లూ.

"అయితే వినండి! మనం ఊరుకోవడానికి వీల్లేదు. మనల్ని తీసెయ్యటానికి ఎంతమాత్రమూ వీల్లేదని భీష్మించుకుని కూర్చుందాం. సమస్త ప్రజానీకాన్నీ జాగృతపరుద్దాం. మన పరిస్థితి వివరించి వాళ్ల తోడ్పాటు కోరుదాం. ప్రాణాలకైనా తెగించి ఎదురునిలుద్దాం! మనకి అండగా ప్రజలందరూ వస్తారు. వచ్చేట్లు మనం చూడాలి. అంతే! అప్పుడు ఎన్ని ఉత్తర్వు లిచ్చినా హెడ్డాఫీసు వాళ్లు అన్నీ వెనక్కు తీసుకుని మనల్ని ఉండనిస్తారు."

"అంతే .. అంతే" అంతా ఏకకంఠంతో అరిచారు. అందరికళ్లల్లో దీక్ష, పట్టుదల.

ఇంతలో ఫోన్ మోగింది.

కాంతారావు ఫోన్ ఎత్తారు.

"హెడ్డాఫీసు నుంచి ట్రంకాల్!" అరిచాడు కాంతారావు.

మళ్లీ ఒక్కసారిగా అంతా నిశ్శబ్దం.

కాంతారావు ఫోన్‌లో మాట్లాడుతున్నారు.

"ఆ" "ఊ" తప్ప మరోటి లేదు.

అంతా ఉత్కంఠతో చూస్తున్నారు.

ఏమి టా వార్త?

అందరి హృదయాల్లో సస్పెన్స్...

"థాంక్యూ!" అని చెప్పి ఫోన్ పెట్టేసి ఇటు తిరిగాడు కాంతారావు.

'ఏమిటి... ఏమిటి.. సంగతి, చెప్పు!"

"గుడ్ న్యూస్. ఇందాక రాకేష్ ప్రాక్టికల్ జోక్ వేశాడట. ఇప్పుడు అసలు నిజం చెప్తున్నాడట! ఇప్పుడే హెడ్డాఫీసు వాళ్లు నిర్ణయం తీసుకున్నారుట. మన ఉద్యోగాలకి ఏ ఢోకా లేదు. మనల్నందరినీ ఇక్కడే ఉంచుతారుట. కానీ ముందు ముందు వచ్చే ఖాళీలు మాత్రం భర్తీ చెయ్యరుట. అంతే."

"ఆహా..."



## ఆ కథలు వేరు

"అనగనగా ఓ రాజు.." అంటూ ఆవేళ శ్రీకాంత్‌కి కథ చెప్పడం ప్రారంభించింది సుశాంతి.

"మమ్మీ! కథలన్నీ అనగనగాతోనే మొదలవుతాయా?"

"అన్నీ కాదు, నాయనా! మీ నాన్నగారు నాకు చెప్పే కథలు - 'సారీ శాంతి! ఆఫీసు నుండి వస్తుంటే .. అంటూ మొదలవుతాయ్."

## కాదు

"మగాడు చెప్పిందల్లా "కాదు" అనడమే మీ ఆడవాళ్ల అలవాటు. అవునా, కాదా?" చిరాగ్గా అడిగాడు భర్త రావు.

"కాదు" అంది భార్యామణి ఖండితంగా.

డాక్టర్ విజయ్ .ఎస్.రెడ్డి [హైదరాబాద్]

"ఓహోహో."

"య్యేహూ."

"అమ్మయ్య."

కేకలు మిన్నుముట్టుతున్నాయి.

అందరి మనసుల్లో ఆనందం.

ఇప్పుడు భవిష్యత్తు నిండుగా హాయిగా కనిపిస్తోంది.

"పార్టీ చేసుకోవాలి" అన్నాడు రమేష్.

అప్పటికప్పుడు స్వీట్లు, హాట్లు, కూల్‌డ్రింక్‌లు వచ్చేశాయి.

స్వీట్‌లో ఇంకొస్త బాదంపప్పు చేర్చి ఉండాల్సిందనీ, సమోసాలో కొస్తంత ఉప్పు తక్కువైందనీ, కూల్‌డ్రింక్స్ అనుకున్నంత 'కూల్'గా లేవనీ చిరాకులూ కామెంట్స్‌తో పార్టీ ముగిసింది.

ఒక్కొక్కళ్లూ లేస్తున్నారు.

ఇంతలో వీధిలో ఏదో కలకలం.

'ఏమిటా?' అని తొంగిచూశారు.

ఎవరో భూకంప బాధితులకి, కరువు బాధితులకీ చందాలు వసూలు చేస్తున్నారు.

వాళ్లల్లో ఒకతను లోపలికి వచ్చాడు.

"సర్! మీకు తోచింది ఇవ్వండి. ప్లీజ్" అన్నాడు.

అంతే... అందరి మొహాలూ మాడిపోయాయి.

కొందరు పావలా, అర్థా వేశారు బాగుండదని. కొందరు అది కూడా వెయ్యలేదు.

ఇప్పుడు కూడా వాళ్లు ఇందాక ఉన్న ప్రపంచంలోనే, ఇదే భూమి మీదే ఉన్నారు. కానీ ఇందాక స్పష్టంగా కనిపించిన దుర్మార్గం, దౌర్జన్యం, కష్టాలూ, కన్నీళ్లూ ఏవీ కనిపించడంలేదు. ఆర్తుల దీనాలాపాలు వినిపించటం లేదు.

ఇప్పుడు ఉన్నదల్లా... జీవితాన్ని ఎంత 'ఎంజాయ్' చెయ్యగలమనే ఆలోచన.

కళ్లముందు అనేక స్వర్ణ స్వప్నాలు.

అందరూ అట్లా, ఒక విధమైన మత్తులో ఉండగా.... కంచుగంటలా వినిపించినది విద్య గొంతు.

"ఇంతసేపూ ఎన్ని కబుర్లు చెప్పారు. ఇప్పుడు మీకేం ఢోకాలేదనే సరికి మామూలు మనుషులుగా మిగిలిపోయారు" అంది విద్య అతను చాచిన హుండీలో పది రూపాయలు వేస్తూ. అది ఆమె శక్తికి చాలా ఎక్కువ.

"పదండి. ఆఫీసు టైమ్ గడిచిపోయింది. నేనూ మీతో వచ్చి చందాలు అడుగుతాను" అంది విద్య.

"మీరా?" అన్నాయి కొన్ని గొంతులు ఆశ్చర్యంగా.

"అవును! నేనే!" అంది విద్య.

ఇందాక తా మింతమంది మాట్లాడుతున్నా ఒక్కమాట కూడా మాట్లాడని విద్యని చూసి, చైతన్యం లేని మనిషని అనుకున్నారు అందరూ. కానీ ఆమె మాటల మనిషి కాదనీ, చేతల మనిషనీ అర్థమై తలదించుకున్నారు.

విద్య ముందుకి నడిచింది.

అప్రయత్నంగా ఆమెని అనుసరించారు కొందరు.

చీకటిలో చిరుదివ్వెలా సాగిపోతున్నారు వాళ్లు.

